క్లుప్తంగా

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం



మైలవరం: మైలవరం పొందుగల రోడ్డులో ఏర్పాటుచేసిన జాలీ స్విమ్మింగ్ పూల్‌ను సర్పంచ్ మంజుభార్గవి, రిటైర్డ్ డీఈ నాగమల్లేశ్వరరావు, లంకా లితీష్ శుక్రవారం ప్రారంభించారు. రిటైర్డ్ డీఈ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ స్విమ్మింగ్ చేయడం వలన మనిషి ధృఢంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బైక్‌లు నడుపుతున్న మైనర్లకు జరిమానా

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బి.లక్ష్మణరావు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇద్దరు మైనర్లు బైక్‌లు నడుపుతున్నట్లు గుర్తించి ఒక్కొక్కరికి రూ. 7వేల చొప్పున జరిమానా విధించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ వారి వాహనాలకే కాక పక్కవారి వాహనాలకు సైతం ప్రమాదాలు తెచ్చిపెడుతున్న మైనర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన మైనర్లు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నడిపినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మరోసారి వాహనాలు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే జరిమానాతో పాటు వారి తల్లిదండ్రులకు జైలు శిక్ష విధిస్తామని చెప్పారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం



తిరువూరు: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి యూనియన్ చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ రీజినల్ వైస్ ప్రెసిడెంట్ ఎంపీకే రావు, సంఘ నాయకులు హరిబాబు, రవిచంద్ర, స్వామి, ఆదినారాయణ ఏఐటీయూసీ నాయకులు ఉదయ్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

చాట్రాయి: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం దోమల నివారణకు ఎబేట్ మందు పిచికారీ చేశారు. గ్రామంలోని అన్ని కాలనీలతో పాటు మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో, డ్రెయినేజీల్లో ఎబెట్ మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ ఐ.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పంటల బీమాను వినియోగించుకోవాలి



చాట్రాయి: ప్రధాన మంత్రి పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. చాట్రాయి ఆర్ఎస్‌కే కేంద్రంలో అన్నదాత సుఖీభవ జాబితాను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ సొంత భూమి కలిగిన రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులని, కుటుంబంలో ఒక్కరికే ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద నమోదైన రైతులకు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే నష్టపరిహారం వస్తుందన్నారు. ఈ పథకంలో చేరాలంటే రైతు ఆధార్, బ్యాంకు బుక్, పాస్‌కార్డు జిరాక్సులతో ఆర్ఎస్‌కేలో కానీ, మీ-సేవా కేంద్రంలోకానీ నమోదు చేసుకోవాలని చెప్పారు.

చేతి పంపునకు మరమ్మతులు

ముసునూరు: రమణక్కపేట ఎస్సీ ఏరియాలో మంచినీటి కష్టాలపై అధికారులు స్పందించారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో చేతి పంపునకు మరమ్మతులు చేయించారు. పనులను నూజివీడు డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఎంపీడీఓ సత్యనారాయణ పర్యవేక్షించారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని ప్రభుత్వ భూములను శుక్రవారం నందిగామ ఆర్డీవో బాలకృష్ణ పరిశీలించారు. గత ప్రభుత్వంలో గ్రామంలో జగనన్న కాలనీలకు కేటాయించిన స్థలాలతో పాటు ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలోని పులిచింతల సమీపంలోని జెడ్పీ స్థలాన్ని కూడా చూశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, సర్వేయర్ అనూష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో.. అవస్థల ప్రయాణం

- ఛిద్రమైన రహదారిపై తరచూ ప్రమాదాలు
- అభివృద్ధికి నోచుకోని సరిహద్దు రహదారి
- పట్టించుకోని అధికారులు
- వాహన చోదకుల నరకయాతన





దుగ్గిరాలపాడు గ్రామ శివారులో ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు రహదారిపై ఏర్పడిన భారీ గుంత ; గంగినేని-దుగ్గిరాలపాడు గ్రామాల మధ్య రహదారి ఇలా..

జి.కొండూరు: రెండు రాష్ట్రాల సరిహద్దులో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సరిహద్దు గ్రామాల ప్రజలు నడవడానికి వీలులేక నరయాతన పడుతున్నారు. ఈ రహదారి అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆర్అండ్‌బీ అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లు నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దకాలం దాటినా..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయి దశాబ్ద కాలం దాటినా సరిహద్దు కష్టాలు ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. జి.కొండూరు మండల పరిధి దుగ్గిరాలపాడు క్రాస్ రోడ్డు నుంచి ఖమ్మం జిల్లా ప్రారంభమవుతుంది. దుగ్గిరాలపాడు క్రాస్ రోడ్డు నుంచి ఖమ్మం జిల్లాలోని కొత్తపాలెం గ్రామం వరకు ఒక కిలో మీటరు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ధ్వంసమైన రహదారి రెండు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండటంతో ఇరు రాష్ట్రాల అధికారులు ఈ రోడ్డు అభివృద్ధిని గాలికొదిలేశారు. దీనితో వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు.

భారీ వాహనాల రాకపోకల వల్లే..

జి.కొండూరు వైపు నుంచి ఖమ్మంకు అతి తక్కువ సమయంలో చేరుకునేందుకు ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తుంటారు. దీనితో ఖమ్మం, వరంగల్ నుంచి గ్రానైట్ లారీలు 60 నుంచి 70 టన్నుల లోడుతో ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. అదేవిధంగా రైల్వే శాఖకు సంబంధించిన కంకర లారీలు, ఇరు రాష్ట్రాల మధ్య ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన పలు వాహనాలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి మొత్తం గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గంగినేని-దుగ్గిరాలపాడు రహదారి అధ్వానం

ఈ రహదారిలో గంగినేని నుంచి దుగ్గిరాలపాడు వరకు ఉన్న మూడు కిలో మీటర్ల రహదారి కూడా అధ్వానంగా మారింది. ఈ రహదారిని కూడా అభివృద్ధి చేయకపోవడంతో సరిహద్దు గ్రామంగా ఉన్న దుగ్గిరాలపాడు గ్రామస్తులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. జి.కొండూరు వైపు నుంచి తెలంగాణ వెళ్లే వాహన చోదకులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నారు.



నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి

గంగినేని నుంచి తెలంగాణ వైపు వెళ్లేందుకు కొత్త పాలెం వరకు ఉన్న రహదారి పెద్ద పెద్ద గుంతలతో దారుణంగా ఉంది. రహదారిని అభివృద్ధి చేయకపోతే ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలి.

– అన్నంశెట్టి వెంకట్రావు, గంగినేని గ్రామస్తుడు



రహదారిని అభివృద్ధి చేయాలి

దుగ్గిరాలపాడు క్రాస్ రోడ్డు నుంచి కొత్తపాలెం వరకు ఉన్న రహదారిని అధికారులు వెంటనే అభివృద్ధి చేయాలి. భారీ వాహనాల వల్ల రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రాత్రి సమయాల్లో ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే నరకయాతన పడుతున్నాం.

– మండల శేషయ్య, మునగపాడు గ్రామస్తుడు



భారీ గుంతలతో వాహనాలు గుల్ల

దుగ్గిరాలపాడు క్రాస్ రోడ్డు నుంచి కొత్తపాలెం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా పాడైపోయింది. తారు రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రాణాలు పోతాయి. వాహనాలు గుల్ల అవుతున్నాయి. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలి.

– ఇరుగుల మణికంటరెడ్డి, మునగపాడు గ్రామస్తుడు

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

తిరువూరు: తిరువూరు మండలంలో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ అక్రమ వినియోగదారులపై రూ.6.24 లక్షల జరిమానా విధించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయకుమారి, నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో 37 బృందాలు తనిఖీలు నిర్వహించాయి. 2,997 గృహ సర్వీసులు, 461 వాణిజ్య సముదాయాలలో విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసిన అధికారులు 198 సర్వీసులకు 312 కిలోవాట్ల అదనపు లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.6 లక్షల 24 వేల జరిమానా విధించారు. తనిఖీల్లో తిరువూరు డీఈ రామకృష్ణ, టౌన్ ఏఈ కృష్ణారెడ్డి, ఇతర డివిజన్ల ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ బైపాస్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జి. రమేష్‌బాబు తెలిపారు. మైలవరంలోని సూరిబాబుపేట, బాలయోగి నగర్, శాంతినగర్, రాజాపేట, చంద్రబాబు నగర్, మాలపల్లి, కుమ్మరి వీధి, బైపాస్ రోడ్డు, ఆల్ఫా సెంటర్, నూజివీడు రోడ్డు, ఎంఆర్ఓ ఆఫీసు రోడ్డు, పాత మసీదురోడ్డు, హాజీపేట, వడ్డెర కాలనీ, చిన్నగూడెం, దేవుని చెరువు తదితర ప్రాంతాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

సారా స్వాధీనం

చాట్రాయి: సారా అమ్మకాలపై దాడులు చేసి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని టి.గుడిపాడు గ్రామంలో దాడులు చేయగా గ్రామానికి చెందిన పామర్తి సాంబశివరావు వద్ద నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

రికార్డుల కోసం కూటమి ఈవెంట్లు

సమస్యలు పట్టని ప్రభుత్వం అంటూ స్వామిదాసు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు, నాయకులు

తిరువూరు: రాష్ట్రంలో కూటమి ఏడాది పాలనలో ప్రజా సమస్యలను గాలికి వదిలివేసిందని, ప్రపంచ రికార్డులు సాధించేందుకే కూటమి పాలకులు కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. తిరువూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర పేరుతో గత నెలలో విశాఖపట్నంలో, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పేరుతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. కేవలం రికార్డులు సాధించేందుకే ఈ కార్యక్రమాలు నిర్వహించిందని చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను గాడిలో పెట్టిందని, పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం, కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వీటిని తుంగలో తొక్కి ఇష్టానుసారం స్కూళ్ల వర్గీకరణ చేపట్టిందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్కూళ్లు మూతబడుతుండటంతో విద్యార్థులు చదువు మానేసే పరిస్థితి నెలకొందని, వెంటనే పాత వ్యవస్థనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది చెల్లించాల్సిన తల్లికి వందనం నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని, ఈ ఏడాది పెండింగ్‌లో ఉన్న వారికి కూడా తక్షణం మంజూరు చేయాలని కోరారు. తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి నవీన్‌కుమార్, చలమాల సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, తిరువూరు నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్, రైతు విభాగం కన్వీనర్ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ యరదేశి రామారావు, బీసీ సెల్ నాయకుడు కాలసాని గోపాల నాగేశ్వరరావు, మైనారిటీ నాయకుడు షేక్ జాకీర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

ఇంజినీరింగ్ కార్మికుల హెచ్చరిక



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఇంజినీరింగ్ కార్మికులు



తిరువూరు నగర పంచాయతీ ఎదుట కార్మికుల అర్థ నగ్న ప్రదర్శన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపాల్టీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. లేకుంటే శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పడతామని కార్మికులు హెచ్చరించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ అర్హత, నైపుణ్యం, సర్వీసును బట్టి వేతనాలు పెంచుతామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ కార్మికుల వేతనం రూ.15 వేలు ఇస్తుంటే అందులో పీఎఫ్, ఈఎస్ఐ కటింగ్ పోను చేతికి రూ.13 వేలు వస్తున్నాయన్నారు. వీటితో వారి కుటుంబ అవసరాలు ఎలా తీరుతాయో ప్రభుత్వ పెద్దలు గుర్తించాలని సూచించారు. వారి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు శ్రీను, వాసు, శివరామకృష్ణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు శుక్రవారం కార్యాలయం ఎదుట అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. గత నెల ఆరో తేదీ నుంచి తమ డిమాండ్ల సాధనకై నిర్వహిస్తున్న ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ నెల 12 అర్ధ రాత్రి నుంచి సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు బలగాని వెంకటేశ్వరరావు తెలిపారు. రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, పదవీ విరమణ అనంతరం ప్రయోజనాలు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని కోరారు. ప్రదర్శనలో సీఐటీయూ నాయకులు ఆకుల రవి, ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు షేక్ బాజీ, కార్యదర్శి కందుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని ఆయుర్వేద వైద్యం



మూసివేసిన ఆయుర్వేద ఆస్పత్రి

ఆగిరిపల్లి: గత కొన్నేళ్లుగా ప్రజలకు వైద్య సేవలు అందించిన మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆస్పత్రి ఇప్పుడు నిరుపయోగంగా మారింది. ఇక్కడ పని చేసే వైద్యురాలు ప్రసన్న వేరే ప్రాంతానికి డెప్యూటేషన్‌పై వెళ్లడంతో మండల ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు. సాక్షాత్తు మంత్రి నియోజకవర్గంలోనే గత సంవత్సరం నవంబర్ నుంచి వైద్యులు లేక ఆయుర్వేద ఆస్పత్రిని మూసివేయడంతో చేసేదిలేక రోగులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. తొమ్మిది నెలల నుంచి ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్య సేవలు అందక పోవడంతో దీర్ఘకాలిక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామానికి సమీపంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

ముసునూరు: గ్రామానికి సమీపంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, గ్రామ మాజీ సర్పంచ్ రేగుల గోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్ధసారథిని శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం భూమిని అమ్మిన తమ కుటుంబ సభ్యులు తిరిగి ఆ భూమిని వెనక్కు తీసుకుని, ప్రభుత్వానికి నగదు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రికి వివరించారు.

ముగిసిన జాతీయ సెమినార్



మైలవరం: అకడమిక్ వేదికలు పర్యావరణ సమస్యలపై అవగాహన పెంపొందిస్తాయని ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి అన్నారు. కళాశాలలో జీవ వైవిధ్య పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ శుక్రవారం ముగిసింది. సెమినార్ కన్వీనర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె. రాముడు మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రజల్లో అవగాహన పెంచి సుస్థిర జీవన విధానాలను అవలంభించడం అత్యంత అవసరమన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రముఖ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, పరిశోధకులు జీవన వైవిధ్యం పరిరక్షణ, వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధానాలు, సుస్థిర పర్యావరణ నిర్వహణ తదితర అంశాలపై మాట్లాడారు. మద్రాసు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్. మతివానన్, యోగివేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎ. మధుసూదన్‌రెడ్డి, ఏఎన్‌యూ ప్రొఫెసర్ ఎస్ఎం ఖాసీం, డాక్టర్ బ్రహ్మాజీరావు, హైదరాబాద్‌కు చెందిన భారత వృక్ష సర్వే సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ శంకరరావు, డాక్టర్ ప్రదీప్ ఎం, డాక్టర్ అహ్మద్ అబ్దుల్ హాలీమ్‌ఖాన్ తదితరులు తమ పరిశోధనలతో పోస్టర్ ప్రదర్శన ఇచ్చారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ



ముసునూరు: మంచి అలవాట్ల అభ్యాసంలో భాగంగా చిన్నారులంతా మొక్కల పెంపకం అలవాటు చేసుకోవాలని చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అల్లాబక్షు అన్నారు. హైస్కూల్లో శుక్రవారం సాయంత్రం 200 మంది విద్యార్థులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు శివనాగమణి, పాదిల అబ్రహాం, రుక్మిణి పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు



ఆగిరిపల్లి: స్థానిక వరాహ పుష్కరిణి వద్ద బాలా త్రిపుర సుందరి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం శాకంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసం సందర్భంగా బాలా త్రిపుర సుందరీ దేవిని కూరగాయలతో సుందరంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు.

ముసునూరులో మత్స్య సొసైటీ ఏర్పాటు చేయాలి



ఏలూరు (టూటౌన్): ముసునూరు గ్రామం దేవర చెరువు, నల్లచెరువు పరిధిలోని పేదలతో మత్స్య సొసైటీ ఏర్పాటు చేయాలని కౌలు రైతు సంఘం, సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మత్స్యశాఖ ఉమ్మడి జిల్లా ఉప సంచాలకులు, అసిస్టెంట్ డైరెక్టర్లకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నూజివీడు మత్స్య సొసైటీలో ఉన్న ముసునూరు చెరువులను వేరుచేసి సొసైటీని ఏర్పాటు చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. 2014 నుంచి ముసునూరుకి సొసైటీ కావాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. దేవర చెరువు, నల్లచెరువుల్లో చేపలు వేసి ఎదిగిన తర్వాత ముసునూరు పేదలే పట్టుకుని జీవిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ముసునూరుకు చెందిన చెంగల వెంకటేశ్వరరావు, సీహెచ్ ఫణికుమార్, కె.రంగారావు, బడుపుల రవితేజ, కొడవలి కిట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి

ఆర్డీఓ కావూరి చైతన్య



గుంటుపల్లి ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ చైతన్య, అధికారులు



కట్టుబడిపాలెంలో దోమల లార్వాను గుర్తిస్తున్న జిల్లా మలేరియా అధికారి మోతీబాబు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు పనిచేయాలని విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య పేర్కొన్నారు. గుంటుపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రై డే డ్రై డే అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించి, ఓపెన్ ప్లాట్లు, జనావాసాల మధ్య నీటి నిల్వలు ఉంటే ఆయిల్ బాల్స్, గంబూచియా చేపపిల్లలు వదలాలని అధికారులను ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ఈ విధానాలతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులను నివారించ వచ్చన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి నీటి నిల్వలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డ్వామా పీడీ ఎ.రాము, ఎంపీడీఓ సునీతశర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్, డాక్టర్ పర్వీన్, ఏపీఎం శోభన్‌బాబు, సర్పంచి భుక్యా కవిత పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు చేపట్టండి

కట్టుబడిపాలెం(జి.కొండూరు): మలేరియా, డెంగీ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి మోతీబాబు వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. మండలంలోని కట్టుబడిపాలెంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోతీబాబు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు, పాత కుండలు, పనికిరాని వస్తువులు ఉంచుకోరాదన్నారు. వాటిలో వర్షం నీరు నిలవడం వలన దోమల లార్వా వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. ఇళ్ల పరిసరాల్లో దోమల లార్వాను గుర్తించి నివారణ చర్యలను వివరించారు. పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్న, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి విమర్శ



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

మైలవరం: రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి మాధవరెడ్డి అన్నారు. రైతు సంఘం ఐదో మహాసభ మైలవరం మండలం చంద్రగూడెంలో శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర లభించక, పెట్టిన పెట్టుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన ఏడు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, చెరువులకు పడిన గండ్లను పూడ్చాలని, రైతులు పొలాలకు వెళ్తున్న అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని, దెబ్బతిన్న బ్రిడ్జిలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, నూజివీడులో మామిడి అనుబంధ పరిశ్రమ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని మహాసభ తీర్మానించింది. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రైతు సంఘం మండల అధ్యక్షుడిగా రావుల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా వజ్రాల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చిలుకూరి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శిగా వజ్రాల ధనలక్ష్మి, 14 మందితో కమిటీని ఏర్పాటు చేశారు.

ఇసుక లారీ స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఏపీ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ తెలి పారు. చందర్లపాడు మండలం ఏటూరు ఇసుక క్వారీ నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మల్కాపురం వద్ద లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. లారీ యజమాని ఖమ్మంకు చెందిన ముత్తవరపు శిఖామణి, తెలంగాణలోని రామకృష్ణాపురానికి చెందిన మోటమర్రి రవికుమార్ గత కొంత కాలంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. దీనిపై కేసు నమోదు చేశారు.